# వెలుగు నివ్వని దీపాలు

"డు...ము...వు...లు... ప్రధమా విభక్తి. ని-ను-ల-కూర్చి - గురించి, ద్వితీయా విభక్తి.. చేత, చే, తోడ, తో,తృతీయా విభక్తి" ఆరో తరగతి చదువుతూన్న నానిగాడు చాలా సేపట్నుండీ విభక్తులు చదువు తున్నాడు.

తగిలినట్లే తగిలి గేలం నుండి పుటుక్కున జారిపోయిన నూతి పోని బకెట్లాగా - పుస్తకం చూసి చదివినంత సేపూ వచ్చినట్లే ఉన్నా - పుస్తకం మూసేసరికి - తుపాకీ దెబ్బకి పిట్టల్లాగా బుర్రలో చెల్లా చెదరయిపోతున్నాయి.

అందుచేత పుస్తకం మీదనే దృష్టి నంతటినీ కేంద్రీకరించి పట్టుదలతో చదివాడు. పుస్తకం చూడకుండా రెండుసార్లు వల్లె వేసుకున్నాడు. వచ్చేశాయి ఎగిరి గంతేశాడు.

ఎదురుగా ఆ రోజు పేపరు చదువుకోటంలో మునిగిన తండ్రి దగ్గరికెళ్ళి "నాన్నారూ! ఈ విభక్తులు ఒప్ప చెప్పుకోరూ?" అన్నాడు.

కొడుకు చేతిలో పుస్తకాన్ని అందు కొని "ఊ..చెప్పు" అన్నాడు సుబ్బరామయ్య.

నానిగాడు "డు..ము..వు..లు ప్రధమా విభక్తి, ని..ను..ల కూర్చి...గురించి కొరకు... కై - తృతీయా విభక్తి... చేతన్ - చే... తోడన్ - తో - చతుర్థీ విభక్తి..." స్పీడ్ గా చెప్పుకు పోతూన్న కొడుకును సడన్ బ్రేకు వేసినట్టు ఆపి-

"ఉరే.. ఉరే.. తప్పు చెప్పేశావురా నాన్నా! రెండు సార్లు జాగర్తగా చదూకో " అన్నాడు".

" అదే మిత్రా! విభక్తులు లేకపోతే వాక్యాలెలా తెలుస్తాయి? ఏది పుల్లింగమో, ఏది స్త్రీ లింగమో ఎలా తెలుస్తుంది మరి?

"డు....ము...వు...లు ఇవి ప్రధమావిభక్తులా? 'డు' చేరినవి పులింగాలు.. రాముడు...కృష్ణుడు... ఇలాగన్న మాట అలాగే 'లు' చేరితే బహువచనం అని తెలుస్తుంది. అలాగే నీ కొఱకు నీ గురించి ఇలాగా వాక్యాలకు పూర్తి అర్థాన్నిచ్చేవి విభక్తులే కదా" అన్నాడు.

మరి 'హరి' దీనికి 'డు' రాదట కదా? ఇది స్త్రీలింగమవుతుందా? మరి స్త్రీ లింగానికి విభక్తులుండవా?"

"ఎందుకుండవూ?"

" మరి సీత, లక్ష్మి వీటికి విభక్తులేవి?"

" వీటికి 'సు' వచ్చి లోపిస్తుంది. అయినా నీకిపప్పుడు చెప్పినా అర్థంకాదు. పోయి కంఠోపాఠం చేసుకో"

"పోనీ అర్థమైనప్పుడే చెప్పొచ్చుగా".

"అబ్బ విసిగించక. పెద్దవాళ్ళు చెప్పినట్టు చెయ్యాలి. గానీ ఎదురు జవాబులు చెప్ప కూడదు.

వెళ్ళి చదుకో అసమర్థతను బయట పడనీకుండా చిరాకుపడుతుం అన్నాడు.

"మా మాస్టారూ అంతే! ప్రశ్నలు వెయ్యకుండా కూర్చుంటే మొద్దు రాచిప్పల్లా కుర్చుంటావని తిడతారు. ప్రశ్నలడిగితే కూర్చో. అడ్డదిడ్డంగా పెసిన్లెయ్యకు, అనవసరంగా వేస్తే టీసీ యిచ్చి తగిలెస్తామంటారు''. అని ఏడుపు ముఖం పెట్టుకుంటూ నానిగాడెళ్ళి పోతుంటే సుబ్బరామయ్యకి జాలేసింది.

నానిగాడు చాలా తెలివైనవాడు. వాడికి అర్థమయితే గానీ దేన్నీ కంఠస్థం చెయ్యడు వాడు అడిగిన ప్రశ్నలకి అప్పుడప్పుడు వాళ్ళ మాస్టర్లు తికమక పడుతూంటారని చాలా సార్లు విన్నాడు. వాణ్ణి కసిరి కూర్చోపెట్టడం అంత మంచి పద్ధతి కాకపోయినా, జవాబు చెప్పలేని ప్రశ్నలు పిల్లల నుండి ఎదురైనప్పుడు చాలా మంది మాస్టర్లు చేసిన పనేవాళ్ళూ చేస్తారు. పాపం!.

చిన్నప్పుడు తనే అన్నింటా ఫస్టు విభక్తుల్నుంచీ కాంపోజిట్ లో సిద్ధాంతాల వరకూ అన్నీ భట్టి పెట్టేసీ వాడే గానీ, ఇది ఇలాగే ఎందుకొస్తుందీ అనే ఆలోచన తన బుర్రని ప్రవేశించేది కాదు. తమకు పాఠం చెప్పే ఉపాధ్యాయులూ, 'ఒప్ప చెప్పు కంఠోపాఠం చెయ్యి' అనే వారే కానీ.. ' అర్థం అయిందా?' అనేవారే కాదు చిన్నప్పుడు.

"తెలుగు మాస్టారూ, ఇంగ్లీషు మాస్టారూ తన మిత్రుడు సోమశేఖరం సొంత వాక్యాల్లో వ్యాసాలు రాస్తే, కంఠస్థం చెయ్యకుండా రాసేవాడని ఎన్ని తిట్లు తిట్టేవారో? తను మాత్రం మాస్టారు చెప్పిన కొటేషన్లు, కామాలు కూడా తప్పక రాస్తే ఎంత పొగిడే వారో?

అందుకే సోమశేఖరం తనను భట్టి విక్రమార్కుడనే వాడు. అప్పుడు తనకెంత కోపం వచ్చేదో?"

ఆలోచిస్తోన్న సుబ్బరామయ్య " సుబ్బరామయ్య గారూ! సుబ్బరామయ్యగారూ!" అనే కేక విని అదిరి పడ్డాడు.

ఆ కేకకు సమాధానం ఆశించకుండా ఆ వ్యక్తి ఇంట్లోకి బుల్లెట్లా దూసుకొచ్చాడు.

"ఏమయ్యా! గొంతు చిట్లేలా అంత లాగా అరుస్తే పలకవూ? నువ్వెందుకు పలుకు తావులే. నా గొంతు చిట్లి చస్తే నీకేం? ఆర్చి చస్తే నీకేం?మూడు బియ్యం బస్తాలొడేసుకొని నాలుగు నెల్లయింది. డబ్బులడిగితే ఇదిగో, అదిగో అంటావు. గట్టిగా అడిగితే కనిపించనే కనిపించవు. దున్నపోతు మీద వాన కురిసినట్టు అలాగుండిపోతావేటి? అసలేటి నీ ఉద్దేశం?" టపటపా మాటల తుపాకీని పేల్చిశాడు.

సుబ్బరామయ్య చెమట్లెక్కిపోయాడు. జవాబు చెప్పటానికి నోట్లో తడిలేదు. "అదికాదు షావుకారు గారూ! మూణ్ణెలయి జీతాలందలేదు. అందగానే ముందు మీ బాకీయే తీరుస్తాను. దయచేసినా మాట వినండి "ప్రాధేయ పడుతూ అన్నాడు.

"నువ్వూ నాను సస్తే గానీ నీ జీతాలు రావు ఇదిగో, మరా పేసికీ లొద్దుగానీ, రేపీ పాటికి అణాపైసవ్తో నాకు ముట్టసెప్పాల"

"అయ్యా! షావుకారిగారూ! ఈ ఒక్కసారికీ నమ్మండి. రేపే అంటే నేనెక్కణ్ణుండి తెచ్చేది? ఓ పదిహేను రోజులాగితే జీతాలొచ్చేస్తాయి".

"ఏటి? పదిహేను రోజులా? నువ్వు మనిషివా, పశివ్వా? అన్నం తింటున్నావా? అశుద్ధం తింటున్నావా? నీకు సిగ్గా సెరం నేదేటి? నెల రోజుల్నుండి నువ్విదే మాటంతన్నావ్. నీ లాటి బేరాలు మఱ్రెండుంటే ఏ గోదాట్లోనో దూకాలో తప్ప మాకో దారుండదు. రెండ్రోజులు టైమిస్తున్నాను. నా బాకీ తీర్చకపోతే మర్యాదుంచను, జాగర్త!" వచ్చినంత స్పీడుగా వెళ్ళాడు షావుకారు.

సుబ్బరామయ్యకి తల తీసినట్లయింది. అయితే రోజుకు చాలా సార్లు తన కలాగే అనిపించటం మామూలు అయిపోవటం చేత అంతగా బాధపడలేదు. అలాంటి పరిస్థితుల్లో లోపల్నుండి భార్య " ఏమండీ? ఏమండీ!" అని గట్టిగా అరుస్తోంది.

" ఎందుకే?"

"అర్జంటుగా ఇలా రండీ!"

"అబ్బ, ఏం కొంపలంటుకున్నాయని?"

సుబ్బరామయ్య విసుక్కుంటూ లేచాడు. ఇంతలో భార్యే వచ్చి "పిలుస్తుంటే రారేమండీ. కాంతి పెద్ద మనిషయింది. అర్జంటుగా కొబ్బరాకులు కొట్టించించి తీసుకురండి. ఇంకా ధాన్యంకావాలి. అలా బేండు మేళం వాళ్ళకు చెప్పిరండి. పంచాంగం తీసి చూడండి. వొర్జాలూ... దుర్మూహోర్తలు ఏమన్నా ఉన్నాయో, ఏమో?" అని బాంబు పేల్చింది.

సుబ్బరామయ్య నెత్తి మీద పిడుగులు పడ్డాయి. కొంత సేపటికి తేరుకొని "చూడు శాంతా! అసలే జీతాలు లేని రోజులు. పండక్కి పెద్దమ్మాయి, అల్లుడూ వచ్చారని రెండు వేలు అప్పు చేశా దానికి వడ్డీలే కట్టలేదు. బియ్యం షావుకారికి నాలుగు నెల్లయి డబ్బు లివ్వలేదని ఇప్పుడే నోటికొచ్చిన తిట్లా తిట్టి వెళ్ళాడు. ఎక్కడా పైసా అప్పు పుట్టదు. నా ముఖం చూస్తే .. ఎక్కడ అప్పు అడిగేస్తానో అని అందరూ నన్ను చూసి పలకరించటం కూడా మానేశారు. ఇప్పుడు నువ్వు మళ్ళీ ఆర్భాటాలు చెయ్యక కామ్‌గా స్నానం చేయించి ఇంట్లో కూచోపెట్టు "అన్నాడు.

"అయ్యో! అయ్యో! ఇదేం చోద్దెమండీ... మీకేమన్నా మతిపోయిందా? ఈ దరిద్రం చాలక ఇంకా ఇంట్లో కలపమంటారా? ఈ విషయం తెలుస్తే నలుగురూ నోట్లో గడ్డిపెట్టర్టండీ".

"అవును. మనకి ఆకలేస్తే అన్నం పెట్టలేని వాళ్ళు గడ్డి పెడతారు. పెట్టకేం చేస్తారు?"

"అమ్మాయినీ మళ్ళీ మళ్ళీ కూచోపెడతాంటండీ. ఇప్పుడు కాక దాని ముచ్చట మరెప్పుడు తీరుస్తాం?"

"శాంతా! నన్నేం చెయ్‌మంటావ్. నా వల్ల కాదు. ఈ ఆచారాలూ, సంప్రదాయాల వల్లనే మన లాంటి వాళ్ళు నడ్డి విరుగుతోంది. నేను ఇక ఎవర్నీ యాచించలేను".

"మీ కివాళే మయిందండీ? రేప్పొద్దున్న మీ నాన్నగారి ఆబ్దికం కూడా ఇలానే చెయ్యనంటారు

కామోసు!".

"కామోసేంటి? మరి చెయ్యలేను నాలో సత్తువ లేదు".

" అయ్యో! పెద్దలు ఎప్పుడో నిర్ణయం చేసిన శాస్త్రాలూ, ధర్మాలూ, కాదంటే ఎలాగండీ? ఏదో అప్పోసప్పో చేసుకోవాలి గానీ!".

"శాంతా! పెద్దలు ఎప్పుడో చెప్పారని ఇవాళ మనకి రోజులు గడవక పోతున్నా చెయ్యలేం. రోజులుని బట్టి మారుతూండాలి". అన్నాడు.

"నాన్నారూ! పెద్దలు చెప్పినట్టు నడచుకోవాలే గానీ, ఎదురు తిరక్కూడదని మీరే చెప్పారు కదండీ" అక్కడే ఉన్న నానిగాడన్నాడు.

"నువ్వు నోర్మూసుకొని వెళ్ళరా! నీ పని నువ్వు చూడు. వెళ్ళు" కసురు కున్నాడు. సుబ్బరామయ్య వాడు బిక్కముఖం వేసుకుంటూ వెళ్ళి పోయాడు.

నిజమే!

"పెద్దవాళ్ళనే కాదు. ఎవరికి మాత్రం తను ఎదురు చెప్పగలిగాడు? అర్థం కాని లెక్కలు 'కంఠస్థం' చేసెయ్యరా" అని లెక్కల మాస్టారంటే చిన్నప్పుడు అలానే చేశాడు. తన కిష్టం లేని బడిపంతులుద్యోగంలో తండ్రి తన తలని దూరిస్తే అలానే దూరాడు. ఇంట్లో అందరూ ఇష్టపడి, శుభలేఖలు వేయిస్తే తన అభిమతం తనకే తెలీక పెళ్ళి పీటల మీద కూర్చున్నాడు.

జీతం ఇవ్వని మేనేజ్‌మెంట్ అర్ధరాత్రి అపరాత్రి అనే తేడాలేక రమ్మంటే వెళ్ళి అరవచాకిరీ చేస్తున్నాడు. కొత్త బియ్యం ఇచ్చి పాతబియ్యం రేటు రాస్తే "అదేం అలాగా? " అని అడిగే ధైర్యం లేక షావుకారు ఇమ్మన్నట్లు పైకం ఇస్తున్నాడు.

బుర్రలో ఆలోచనల్ని కత్తిరించేసే తన చదువుల లోపమా? తను పెరిగే వాతావరణ లోపమా? ఎక్కడుంది లోపం? ఆలోచిస్తోన్న సుబ్బరామయ్యకు ఎదురుగా భయంతో కళ్ళుమూసుకొని డు...ము...వు...లు, చదువుతోన్న కొడుకు కనిపిస్తోంటే భయం వేసింది. జాలి వేసింది. వెళ్ళి వాడి చేతిలో పుస్తకంలాక్కుని దూరంగా విసిరేసాడు.

వాణ్ణి చూడలేక పాదాల దగ్గర కన్నాలు పడిన చెప్పుల్లో కాలు దూర్చి 'అప్పుకోసం' వీధిలోకి దారితీశాడు.

(విజయభావన (విజయనగరం) రాష్ట్రస్థాయిలో నిర్వహించిన కథలపోటీలో ప్రథమ బహుమతి పొంది - స్వాతి మాసపత్రిక లో ముద్రితము.)

* * * *